వైసీపీ కార్యకర్తకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - యస్. రాయవరం : మండలంలో పెట్టుగోళ్లపల్లి గ్రామంలోని వైసిపి కార్యకర్తకు పార్టీ అధిష్టానం ఆర్థిక సహాయం అందించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జరిగిన జరిగిన దాడిలో కొంగ్ర కనకరావు గాయపడ్డారు. దీంతో వైసీపీ అధినేత వైయస్. జగన్మోహనరెడ్డి ఆదేశాలు మేరకు 50 వేలు రూపాయలు చెక్కును పాయకరావుపేట నియోజకవర్గం ఇన్ చార్జ్ మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, ఎంపిపి కోన లోవ లక్ష్మి, వైస్ ఎంపీపీ అప్పన్న, వైసీపీ నాయకులు కొణతాల శ్రీనివాసరావు, మధు వర్మ, వియ్యపు వరహాలు, చొప్ప రాజు, కర్రి సత్యనారాయణ, పాలపర్తి పాపారావు, వెంకటరాజు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎసెన్షియా కంపెనీ యాజమాన్యాన్ని తక్షణమే అరెస్ట్ చేయాలి : రామకృష్ణ

- బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడతాం - 5 సంవత్సరాలలో 119 ప్రమాదాల్లో 120 మంది మృతి
- నష్ట పరిహారంతో సరిపెట్టుకుంటున్న ప్రభుత్వాలు - కంపెనీలలో భద్రతా ప్రమాణాలపై తనిఖీలెక్కడ?
-17 మంది కార్మికుల మృతి కలచివేసింది

విశాలాంధ్ర - రాంబిల్లి : విశాఖ పరిసర ప్రాంతాల్లో ఏటా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నా ప్రభుత్వాలు మాత్రం నష్ట పరిహారాలు ఇచ్చి తప్పించుకోవడం తప్ప యాజమాన్యాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని రాష్ట్ర సిపిఐ కార్యదర్శి,మాజీ శాసనసభ్యులు కె.రామకృష్ణ అన్నారు.బుధవారం నాడు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ లో రసాయనం లీకై భారీ ప్రమాదం జరిగిన ఎసెన్షియా ఫార్మా కంపెనీని శనివారం నాడు ఆయన సందర్శించారు. తొలుత పోలీసులు కంపెనీలోకి వెళ్ళడానికి రామకృష్ణతో పాటుగా సిపిఐ సభ్యులను అనుమతించకపోవడంతో యజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తున్న పోలీసులు అంటూ నినాదాలు చేస్తూ తమను లోపలికి అనుమతించాలని ఆందోళన చేపట్టారు. ఎస్పై కె.రమణ రామకృష్ణతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కంపెనీ లోనికి ఎవ్వరినీ అనుమతించలేమని చెప్పడంతో కంపెనీ బయటనే రామకృష్ణ విలేఖరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎసెన్షియా ఫార్మా కంపెనీలో బుధవారం చోటు చేసుకున్న ఘటన చాలా ఘోరమైనదని దాదాపు 17మంది చనిపోయి, చాలామంది ఆసుపత్రులలో మృత్యువుతో పోరాడుతు న్నారన్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నామని చెప్తున్నారన్నారని తెలిపారు. విశాఖపట్నం పరిసరాల్లోని పరవాడలో 90, పైడి భీమవరంలో 40 ,అచ్యుతాపురంలో 208 ప్రమాదకరమైన భారీ ఫార్మా కంపెనీలున్నాయని, 2019 నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో ఫార్మా కంపెనీలలో 119 ప్రమాదాలు జరుగగా 120మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత దారుణమైన విషయంగా తాము పరిగణిస్తు న్నామన్నారు. నాలుగేళ్ల క్రితం విశాఖలో జరిగిన ఎల్‌జీ పాలిమర్స్ ప్రమాదంలో 12మంది చనిపోతే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వచ్చి మృతులకు కోటి రూపాయలు ఇచ్చారని, ఇప్పుడు అచ్యుతాపురంలో జరిగిన ఈ ఘటనలో సీఎం చంద్రబాబు వచ్చి మృతులకి కోటి రూపాయలు నష్ట పరిహారం ప్రకటించారు తప్ప ఎసెన్షియా కంపెనీ యాజమాన్యం మటుకు ఇక్కడికి రాకుండా తప్పించుకుని తిరుగుతున్నారన్నారు. ఇక్కడ ప్రమాదకర పరిస్థితుల్లో ఉద్యోగులకు అతి తక్కువ జీతాలు చెల్లించి కంపెనీ నుంచి వచ్చే కోట్ల రూపాయల లాభాలను తీసుకుంటూ అమెరికాలో ఉండడమేమిటని విమర్శించారు. లాభాల మీద ఉన్న ధ్యాస కార్మికుల భద్రత,ఉద్యోగుల బాగోగులపై శ్రద్ధ లేకపోవడం దారుణమని,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి చిత్త శుద్ధి ఉంటే ఈ ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యం ఎక్కడున్నా తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. ఈ ఫార్మా కంపెనీలలో జరుగుతున్న ప్రమాదాలలో కార్మికుల ప్రాణాలు పోవడానికి అధికారులు యజమాన్యాలతో లాలూచీ పడటమే ముఖ్య కారణమన్నారు. ముఖ్యమంత్రులుగా ఎవరు ఉన్నా నష్ట పరిహారం ఇచ్చి చేతులు దులుపుకోకుండా మరలా ఇలాంటి ప్రమాదాలు జరగ కుండా చూడాలని ఎద్దేవా చేశారు.

సమావేశం అనంతరం అక్కడి నుంచి వెళ్తున్న రామకృష్ణకు ఎస్పై కె.రమణ ఉన్నతాధికారులుతో ఫోన్ లో మాట్లాడించిన తర్వాత కంపెనీలో ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించడానికి అనుమతి ఇచ్చారు. ప్రమాదం సంభవించిన తీరును పరిశీలించి బయటకు వచ్చిన ఆయన చాలా ఘోరమైన ప్రమాద మన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వి.వి ప్రసాద్, అనకాపల్లి, విశాఖ జిల్లా కార్యదర్శులు బాలేపల్లి వెంకటరమణ, ఎం.పైడిరాజు, ఎ.పి మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, సిపిఐ నాయకులు జి గురుబాబు, ఆర్ అప్పలరాజు, బి.సుబ్బలక్ష్మి, బి పరమేశ్వరి, వి.అర్జున్, కాసుబాబు, వి కన్నబాబు, జి.ఫణీంద్ర, బాబ్జి, కనకమహాలక్ష్మి పాటు సిపిఐ మహిళా సమాఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆధ్వర్యంలో కుక్కలు ఏరివేత : సర్పంచ్ లోచల సుజాత

విశాలాంధ్ర - గొలుగొండ : మండలంలో మేజర్ పంచాయతీ అయిన ఎల్ పురం గ్రామంలో వీధి కుక్కలను పట్టించి వాక్సినేషన్ వేయించి సుదుర ప్రాంతానికి తరలించడం జరుగుతుందని సర్పంచ్ లోచల సుజాత పంచాయతీ కార్యదర్శి పై శ్రీనివాసరావు తెలియజేశారు ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత మాట్లాడుతూ వీధి కుక్కల వల్ల ప్రజలు చిన్న పిల్లలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అలాగే చిన్న పిల్లలను వివిధ ప్రాంతాల్లో వీధి కుక్కలు చంపేయడం జరిగిందని వాటిని దృష్టిలో ఉంచుకొని ఈ వీధికొక్కలను ఏరువేత కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆమె తెలియజేశారు ప్రజల నుండి వచ్చిన అభ్యర్థన మేరకు ముందస్తుగా గ్రామంలో దండోరా వేయించి వెంటనే తగు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు దీనికి స్థానిక ప్రజలు కూడా సహకరించాలని ఆమె కోరారు పెంపుడు కుక్కలను వీధుల్లో వదలకుండా చూడాల్సిన బాధ్యత యజమానులపై ఉందన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మామిడి కృష్ణ గ్రామ పెద్దలు కుండల పెదబాబులు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

ఫార్మా ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపించాలి

విశాలాంధ్ర - పరవాడ : ఎసెన్షియా, సినర్జిన్ పరిశ్రమల్లోజరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపించి యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ సెజ్ లలో కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం లంకెలపాలెం కూడలి వంతెన వద్ద సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 మంది ప్రాణాలను బలిగొన్న ఎసెన్షియా యాజమాన్యాన్ని అరెస్టు చేయకపోవడం ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనం అన్నారు. యాజమాన్యాలకు రాయితీ కలిస్తూ కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం వల్లే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శించారు. వరుస ప్రమాదాలపై తనిఖీలు లేకపోవడం వల్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్మికులు క్షణక్షణం భయాందోళనతో విధులు నిర్వహించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎస్ఈజెడ్, పరవాడ ఫార్మాసిటీలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నప్పటికీ ఈ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లేకపోవడం కార్మికుల ప్రాణాలు కోల్పోవడానికి కారణం అవుతుందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రాథమిక చికిత్స సదుపాయం లేకపోవడం వల్ల విశాఖపట్నం వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఈ లోగానే కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో బర్నర్ వార్డుతో కూడిన 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్య సదుపాయం అందించేందుకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని కోరారు. పరిశ్రమల శాఖల అధికారులు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు పరిశ్రమలను తనిఖీ చేసి భద్రతల ప్రమాణాల మెరుగుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కరణం వెంకట్రావు, ఫార్మాసిటీ యూనియన్ నాయకులు లక్ష్మణరావు, సంతోష్, రమేష్, నాగరాజు, దేవ కిషోర్ తదితరులు పాల్గొన్నారు

రోడ్లపై ప్రమాదకర గుంతలను పూడ్చాలి

విశాలాంధ్ర - కే కోటపాడు : మండల కేంద్రం కే కోటపాడు నుండి చౌడువాడ వరకు ఆర్ అండ్ బి రోడ్డుపై ఉన్న ప్రమాదకర గుంతలను పుడ్చాలని వాహన చోదకులు కోరుతున్నారు. గతంలో పలుచోట్ల గుంతలను పూడ్చినప్పటికీ ప్రమాదకరమైన గుంతలు కొన్నింటిని నేటికీ పూడ్చలేదు. దీంతో వాహన చోదకులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. వర్షాలు సమయంలో ఆ గుంతల్లో నీరు చేరి మరింత ప్రమాదకరంగా తయారవుతున్నాయి. గొండు పాలెం గుల్లేపల్లి గ్రామాల మధ్యలో ఈ గుంతలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి పూట ఈ మార్గం గుండా ప్రయాణించే వారు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల సర్వసభ్య సమావేశం లో ఆర్ %డ%బి అధికారులను గుంతలు పుడ్చాల్సిందిగా ఎన్ని సార్లు కోరినా నిధులు లేవన్న సమాధానం చెబుతున్నారు. చౌడువాడ తర్వాత రోడ్డు పక్కనే పెద్ద గోతులు తీసి రోడ్డుపైనే మట్టి కుప్పలను ఉంచారు. ప్రమాదకరమైన గుంతలకు మరమ్మతులు నిర్వహించడంతోపాటు రోడ్ల పక్క ఉన్న ప్రమాదకరమైన మట్టి కుప్పలను తొలగించాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.

రెల్లి సామాజిక వర్గానికి ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలి

విశాలాంధ్ర - గొలుగొండ : ఎస్సీ ఎస్టీ వర్గీకరణలో భాగంగా రెల్లీ కులస్తులకు రిజర్వేషన్లు ఐదు శాతం కల్పించాలంటూ అనకాపల్లి జిల్లా గొలుగొండ మం దలం మేజర్ పంచాయతీ అయినా ఏఎల్ పురం గ్రామంలో రెల్లి యూత్ ఆధ్వర్యంలో గ్రామ వీధుల్లో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవరాయ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం రెల్లియూత్ ప్రెసిడెంట్ ఎర్రం శెట్టి అప్పన బాబు, బంగారు వరలక్ష్మి నారాయణమూర్తి, బంగారు కృష్ణ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాలుగా చేసిన పోరాట ఫలితంగానే ఎస్సీ ఎస్టి వర్గీకరణ జరిగిందన్నారు.కానీ రెల్లిసామాజి వర్గానికి అన్యాయం జరిగిందని కేవలం ఒక్క శాతము మాత్రమే కేటాయించారని, మాదిగలకు ఏడు శాతం ,మాలలకు ఆరు శాతం ,కేటాయింపులు జరిగాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రత్యేక చొరవ చూపి తమ సామాజిక వర్గానికి ఐదు శాతం కేటాయించేటట్లు చర్యలు తీసుకోవాలని వారు ఈసందర్భంగా కోరారు ఈ కార్యక్రమంలో మజ్జి సత్యనారాయణ, కోన కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

18 మంది కార్మికుల మరణానికి కారణమైన ఎసెన్షియా కంపెనీ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి

దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ డిమాండ్

విశాలాంధ్ర - చోడవరం : 18 మంది కార్మికుల మరణానికి కారణమైన ఎసెన్షియా కంపెనీ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లి జిల్లా చోడవరంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సుర్ల వెంకటరమణ మాట్లాడుతూ కార్మికుల మృతికి, క్షతగాత్రులు కావడానికి కారణమైన కంపెనీ యాజమాన్యాలపైన, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల పైన ఐపిసి 304 సెక్షన్ కింద కేసులు నమోదు చేయాలన్నారు. ప్రమాదంలో మరణించిన వారికి, గాయపడిన వారికి కంపెనీ యాజమాన్యం కోటి రూపాయలు, ప్రభుత్వము మరో కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాల పై ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండరాదని, ప్రజలు అభివృద్ధి కేంద్రంగా పరిశ్రమలు ఉండాలని, మానవ విధ్వంసకార పరిశ్రమలను మూసివేయాలని నినాదాలు చేశారు. పరవాడ సినర్జిన్ సంస్థలో నిర్లక్ష్యం వల్ల జరిగిన ఘటనలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత విముక్తి ప్రతినిధులు బి.సన్యాసమ్మ, యు.శివ, చోడవరం నాయకులు హుస్సేన్, బోడయ్య, ఈశ్వరి, ద్వారకనగర్ సంక్షేమ సంఘం నాయకులు చిన్నారావు, రహిమాన్, జ్యోతి, మోతి, మహేష్, అప్పయ్యమ్మ, శ్రీను, దావీద్,అక్బర్, భవాని, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్‌లో కృష్ణాష్టమి సంబరాలు

విశాలాంధ్ర - పాయకరావుపేట : స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల నందు శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకుని సంబరాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా చిన్న బాలవనం నుండి 2వ తరగతి చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలలో అలరించారు. విద్యార్థులు శ్రీ కృష్ణుడిని పూజించి, వెన్న, మీగడలను నైవేద్యంగా సమర్పించారు. ఉట్టి సంబరాలలో ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణ శతక పద్యాలను పఠించి, కృష్ణుడి జననం, లీలలను నృత్య గానాలతో ప్రదర్శించి, ఆహుతులను అలరించారు. ఉపాధ్యాయులు శ్రీ కృష్ణుడి యొక్క జన్మ వృత్తాంతాన్ని కళ్ళకు కట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్

విశాలాంధ్ర - నక్కపల్లి : మండలంలోని ఏపీఐఐసీ భూ సేకరణ చేసిన పలు గ్రామాలను శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఆర్డిఓ జయరాం లతో పాటు ఏపీఐఐసీ అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరి శీలించారు. ముందుగా జాతీయ రహదారిని కలుపుకొని కాగిత మీదుగా పాటిమీద భూ సేకరణ చేసే రహదారికి సంబంధించిన భూములను పరిశీలించారు అందుకు సంబంధించిన మ్యాప్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు పూర్తిస్థాయిలో వివరించారు. అనంతరం పాటి మీద, అమలాపురం ,డి ఎల్ పురం ప్రాంతాల్లో భూసేకరణ చేసిన ఏపీఐఏసి భూములను పరిశీలించారు ప్రధానంగా బల్క్ డ్రగ్స్ కు సంబంధించి ఎంత భూ సేకరణ చేశారు. ఏపీఐఐసీకి ఎంత భూ సేకరణ చేశారు అనేది స్పష్టంగా ఉండాలని కలెక్టర్ అన్నారు. పరిహారం ఎంతవరకు చెల్లించాం ఇంకా ఎంత మేరకు చెల్లించాల్సి ఉంది పూర్తిస్థాయిలో వివరాలు తెలియచేయాలని ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసు కోవాలని అధికారులందరూ సమ న్వయంతో పని చేయాలని ఆదేశించారు. పరిహారం చెల్లించినప్పటికీ ఎందుకు భూములను స్వాధీనపర్చుకోలేదని ఎందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె ప్రశ్నించారు. అనంతరం డిఎల్ పురం సముద్ర తీరంలో పర్యటించారు ఆర్ఎన్ఆర్ ప్యాకేజ్ విషయం పై ఆరా తీశారు. ముందుగా బల్క్ డ్రగ్స్ సేకరణ చేసిన భూముల ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమెతోపాటు ఏపీఐఐసీ జెడ్ ఎం రామామణి, తాసిల్దార్ అంబేద్కర్ రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు. ఇది ఇలా ఉండగా ఆర్డీవో జయరాం తాసిల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవిన్యూ అధికారులు, వీఆర్వోలు, ఏపీఐసీ సిబ్బందితో సమీక్ష జరిపారు. ఇందుకు సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలని నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు.

సినర్జిన్ ఫార్మా ప్రమాదం పై సమగ్ర విచారణ జరిపించాలి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జునరావు

విశాలాంధ్ర - పాయకరావుపేట : ఎసెన్షియా ఫార్మా ఘటన జరిగి 24 గంటలు గడవక ముందే పరవాడ ఫార్మాలో మరో ప్రమాదం జరిగిందంటే కంపెనీ యాజమాన్యాలు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయో అర్థం అవుతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వెలుగుల అర్జునరావు విమర్శించారు. ఎసెన్షియ ఫార్మాలో జరిగిన ఘటనలో గాయపడిన వారిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తో కలిసి ఆయన పరామర్శించారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయని తెలిపారు. భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఫార్మా కంపెనీలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమ యాజమాన్యాలపట్ల ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రమాదాలు జరిగిన కంపెనీ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకొని వుంటే ఇలాంటి ప్రమాదాలు మరలా సంభవించేవి కావని వెలుగుల అర్జునరావు తెలిపారు.

చేయూత డబ్బులు లబ్ధిదారులు అకౌంట్లో వేయాలి

జెడ్పీటీసీ సభ్యులు సుర్ల వెంకటగిరి బాబు

విశాలాంధ్ర - గొలుగొండ : వైయస్సార్సీపి ప్రభుత్వంలో చేయూత లబ్ధిదారులకు కొందరికే న్యాయం చేసి మరికొందరికి అన్యాయం చేయడం ఏమిటని ఎన్నికల ముందు విడుదల చేసిన డబ్బును మిగతా వారికి ఎప్పటిలోగా వారి అకౌంట్లో జమ చేస్తారో తెలపాలంటూ గొలుగొండ జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు అధికారులను నిలదీశారు శనివారం జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశంలో జడ్పిటిసి మాట్లాడుతూ మండలంలో చీడి గుమ్మల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంజూరైన భవన నిర్మాణానికి టెండర్ పిలవాలని కోరారు అదేవిధంగా ఇటీవల జరిగిన గ్రామసభల్లో అధికారులు ప్రోటోకాల్ ను విస్మరించారని పచ్చబెల్ల పెట్టుకొస్తే వేదికను ఎక్కిస్తామంటూ అధికారులు రోటోకాల్ అర్థాన్ని మార్చేశారని ఆయన దుయ్యబట్టారు అనేక చోట్ల ఇలాంటి కారణాలు గొడవలు కూడా జరిగాయన్నారు ఇకపై అధికారులు ప్రోటోకాల్ ను అనుసరించి ఎటువంటి సభలైన నిర్వహించాలని ఆయా సందర్భంగా అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు.

నాణ్యత ప్రమాణాలు పాటిస్తే ప్రజాదరణ

ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

విశాలాంధ్ర - అచ్యుతాపురం : వినియోగదారులకు అందుబాటు ధరలో నాణ్యమైన , రుచికరమైన ఆహార పదార్థాలు అందిస్తే ప్రజాదారణ ఉంటుందని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన అచ్యుతాపురంలో నా హెూటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందిస్తే అటువంటి హెూటల్ పై ఎల్లప్పుడూ ప్రజాదారణ ఉంటుందన్నారు. అలాగే అప్పన్నపాలెం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర మినీ వ్యాన్ ఓనర్ అసోసియేషన్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, జనసేన నాయకులు బైలపూడి శ్రీరామదాసు, ద్వారపురెడ్డి బాబ్జి, కొరుపోలు చిన్నారావు, డ్రీమ్స్ నాయుడు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీలలో ప్రమాదాలు పునరావతం కాకూడదు : హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : అచ్యుతాపురం సెజ్ లో ఎసెన్షియా ఫార్మా కంపెనీ ప్రమాద ఘటనలో 17 మంది మరణించడంతో పాటు 20 మందికి తీవ్ర గాయాలు, 18 మందికి స్వల్ప గాయాలు కావడం దురదృష్టకరమైన సంఘటన అని రాష్ట్ర హెూమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక వేత్తల సంఘాల సభ్యులు జిల్లా అధికారులతో పరిశ్రమలలో ఉద్యోగుల భద్రత, పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదలపై తీసుకోవలసిన చర్యలు తదితర అంశాలపై శని వారం ఉదయం జీవీఎంసీ ఎస్సార్ శంకరన్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ఎసెన్షియా ఫార్మా ప్రమాద ఘటన జరిగిన తదుపరి ఇలాంటి సమావేశం నిర్వహించుకోవడం బాధాకరమన్నారు. సంఘటన జరిగిన వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లతో పాటు జిల్లా యంత్రాంగం మొత్తం అప్రమత్తమై ప్రతిక్షణం పర్యవేక్షిస్తూ బాధితులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఫైర్ సిబ్బంది ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది ఎంత శ్రమించారనేది తెలిపారు. బల్క్ డ్రగ్స్ పరిశ్రమలలో రియాక్టర్ వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇలా జరగకుండా ఉండాలంటే ప్రతి పారిశ్రామికవేత్త వారి కంపెనీకి సంబంధించి పూర్తి సేఫ్టీ వద్ధతులు పాటించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సేఫ్టీ కిట్స్ కూడా లేని పరిశ్రమలు ఉన్నాయని, అధికారులు తనిఖీలు నిర్వహించి అటువంటి కంపెనీ యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే ఉద్యోగులకు శిక్షణ ఇచ్చిన అనంతరం విధులు లోకి తీసుకోవాలన్నారు. చిన్న చిన్న పొరపాట్లు భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలుగా మారే పరిస్థితి వస్తుందని, ప్రతి పారిశ్రామికవేత్త ఎస్ఓపి పాటించాలన్నారు. నిన్న జరిగిన సంఘటన చివరిదిగా ఉండాలని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పారిశ్రామిక వేత్తలు సేఫ్టీ పద్ధతులను పాటించాలన్నారు. ఏ ఒక్కరూ ప్రాణం నష్టపోకూడదని అందుకు పారిశ్రామికవేత్తలు సహకరించాలని మంత్రి కోరారు. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా అధికారులు స్పందించడం జరిగిందని, సంఘటన జరిగిన 24 గంటలలోపే ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు చొప్పున చెక్కులను ఎక్స్ గ్రేషియా గా అందజేయడం జరిగిందన్నారు. అదేవిధంగా తీవ్ర గాయాలైన 20 మందికి ఒక్కొక్కరికి 50 లక్షలు చొప్పున, స్వల్ప గాయాలైన 18 మందికి ఒక్కొక్కరికి 25 లక్షలు చొప్పున వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. వైద్యం పొందుతున్న ఉద్యోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై పర్యవేక్షించడం జరుగు తుందన్నారు. కంపెనీ యాజమాన్యంపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. జిల్లాస్థాయి సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసి రెడ్ ఆరెంజ్ జోన్ లో ఉండే కంపెనీలను ఈ కమిటీ పరిధిలోకి తీసుకు వస్తామన్నారు. ప్రతి కంపెనీలో ప్రమాదం జరిగే అవకాశం ఉన్న సమయంలో అలారం ఏర్పాటు, మాక్ డ్రిల్స్ నిర్వహణ, అవసరమైన ఉద్యోగులకు సేఫ్టీకిట్స్ అందుబాటులో ఉంచాలని పారిశ్రామిక వేత్తలకు సూచించారు. జిల్లా అధికారులు, మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో సీఎం చంద్రబాబు స్వయంగా వచ్చి సమీక్ష నిర్వహించి, మంత్రులకు అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ మాట్లాడుతూ. ఒకపక్క ఇండస్ట్రీస్ రావాలి,అదే సమయంలో సేఫ్టీకి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి. ఎవరైనాసరే ప్రాపర్ ఎస్ఓపీ ఫాలో అయితే ఇటువంటి సంఘటనలు జరగవు అన్నారు. అవసరమైన టెక్నాలజీస్ ను అడాప్ట్ చేసుకుని, స్మెల్ ను గుర్తించే సెన్సార్స్ వస్తున్నాయి, లీకేజీలను గుర్తించే సెన్సార్స్ వస్తున్నాయి.. ఇండస్ట్రీస్ మేనేజ్ మెంట్ లు కూడా లేటెస్ట్ టెక్నాలజీలను వినియోగించుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ .ప్రతీ పరిశ్రమ తమ భద్రతా ప్రమాణాలను సమీక్షించుకోవాలన్నారు" ఇంటర్నల్ సేఫ్టీ ఆడిట్ వల్ల అనేక సమస్యలు తోలగుతాయని తెలిపారు. ప్రతీ పరిశ్రమలో ప్రమధాలు జరగకుండా తీసుకోవలసిన చర్యలు, అనుకోని సంఘటన జరిగినప్పుడు చేపట్టవలసిన చర్యలు గురించి ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. జిల్లా సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని, పరిశ్రమలను తరచూ తనిఖీ చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్పి దీపికా పాటిల్, జెసి జాహ్నవి, శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్ కుమార్, పంచకర్ల రమేష్ బాబుజిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, పరిశ్రమల శాఖ, బ్రాయిలరర్స్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఏపీఐఐసీ అధికారులు, వివిధ పారిశ్రామికవేత్తలు, పారిశ్రామికవేత్త సంఘ సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.